క్లుప్తంగా

శాకంబరిగా దర్శనమిచ్చిన తాళ్లమ్మ తల్లి



కొత్తపేట: స్థానిక కమ్మిరెడ్డి పాలెం గ్రామదేవత తాళ్లమ్మ తల్లి అమ్మవారు శాకంబరిగా దర్శనమిచ్చారు. ఆషాఢ మాసం శుక్రవారం సందర్భంగా ఆలయ కమిటీ ప్రెసిడెంట్ విద్యా సత్యనారాయణ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆలయ ఆసాదులు అమ్మవారిని కూరగాయలు, ఆకుకూరలతో అలంకరించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తపేట పరిసర ప్రాంతాల భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

గోధుమ తాచు హల్‌చల్

సఖినేటిపల్లి: మండలంలోని ఉయ్యూరువారి మెరక మర్రిచెట్టు సెంటర్‌కు సమీపాన ఓ చెత్త గుట్ట వద్ద శుక్రవారం సుమారు ఆరు అడుగుల పొడవున్న గోధుమ తాచు పాము హల్‌చల్ చేసింది. అయితే చెత్తలో కదలకుండా చాలా సేపు ఉండి పోవడంతో స్థానికులు అధిక సంఖ్యలో పాము చూడడానికి ఎగబడ్డారు. అనంతరం స్నేక్ క్యాచర్‌ను రప్పించి పామును బంధించారు. దీంతో అక్కడి ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

మండల అభివృద్ధికి కృషి చేయాలి



కొత్తపేట మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

కొత్తపేట: మండల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఎంపీపీ మార్గన గంగాధరరావు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ మండలంలో పలు సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. మండల అభివృద్ధి విషయంలో తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని చెప్పారు. ప్రస్తుతం వర్షాలు, వరదలు దృష్ట్యా అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీరు, విద్యుత్ వంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి, వైస్ ఎంపీపీ దంగేటి వెంకట నాగమణి, డీఎల్‌డీవో రాజేశ్వరరావు, ఎంపీడీవో కె.వాణి, తహసీల్దార్ జి.ఎలీషా తదితరులు పాల్గొన్నారు.


అరాచక పాలనతో ప్రజలను మెప్పించలేరు



పాటి శివకుమార్

సఖినేటిపల్లి: రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగంతో అరాచక పాలన సాగిస్తే ప్రజల మెప్పు పొందలేరని వైఎస్సార్ సీపీ జేసీఎస్ జిల్లా కో ఆర్డినేటర్ పాటి శివకుమార్ అన్నారు. శుక్రవారం సఖినేటిపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో దమనకాండకు ప్రజలు విసుగెత్తి పోతున్నారని, మర్డర్లు, మానభంగాలు, కూల్చివేతలు, దాడులు జరగడం దారుణమని ఆయన అన్నారు. వినుకొండలో పార్టీ కార్యకర్తను నడిరోడ్డుపై పాశవికంగా హత్య చేయడం కూటమి పార్టీ విధానాలకు అద్దం పడుతోందన్నారు.

డ్రైన్లు శుభ్రం చేయించిన వైద్యుడు



చింతలమోరిలో డ్రైన్ పారుదల మెరుగుపరుస్తున్న సర్పంచ్ రమేష్‌బాబు

మలికిపురం: గత కొద్దిరోజులుగా పడుతున్న వర్షాల కారణంగా చింతలమోరి గ్రామంలో రోడ్లకు ఇరువైపులా కాలనీల్లో నీరు నిలువ ఉండడంతో గ్రామస్తులు ఇబ్బంది పడటాన్ని సర్పంచ్, వైద్యుడు రాపాక రమేష్‌బాబు పరిశీలించారు. దీంతో శుక్రవారం ఆయన జేసీబీ సాయంతో గ్రామమంతా తిరిగి రోడ్లకు ఇరువైపులా తూములను శుభ్రం చేయించారు. అలాగే ఆయన కూడా స్వయంగా పార తీసుకుని డ్రైన్ నీరు తొలగింపునకు మార్గం సులభం చేశారు. ఆయన వెంట కార్యదర్శి, సిబ్బంది కూడా ఉన్నారు.

ఆదిలోనే హంసపాదు

- రైతుకు కష్టాలు ప్రారంభం
- 50 శాతం పాడైపోయిన నారుమడులు
- మళ్లీ నారుమడులు వేయలేమని గగ్గోలు
- ఎకరానికి రూ.3 వేల నష్టం

రాజోలు: ఆరుగాలం శ్రమించే రైతులకు సార్వా సాగు ఆదిలోనే హంసపాదుగా మారింది. ప్రకృతి వైపరీత్యాలతో వరి సాగు చేపట్టిన రైతులు ఏటా నష్టాలను చవిచూస్తున్నారు. రైతులు స్వారా సాగు చేపట్టేందుకు వరి నారుమడులు సిద్ధం చేసుకున్నారు. ఈ నెలారంభంలోనే వరినాట్లు వేసే విధంగా ఆకుమడులు వేసుకున్న తరుణంలో అకాల వర్షాల కారణంగా ఆకుమడులు పూర్తిగా నీటమునిగాయి. ఒక ఎకరంలో వరిసాగు చేసేందుకు ఐదు సెంట్ల విస్తీర్ణంలో వరి నారుమడులు వేసుకున్నారు. ఎకరం నారుమడికి విత్తనాలు, ఆకుమడి దమ్ము, ఎరువులు, కూలీలతో కలుపుకుని సుమారుగా రూ.మూడు నుంచి నాలుగు వేలు పెట్టుబడి పెట్టారు. అయితే ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో వరి నారుమడులు పూర్తిగా నీటమునిగాయి. నారుమడుల్లో ముంపునీరు తొలగించుకునేందుకు రైతులు నానాఅవస్థలు పడుతున్నారు. కొన్ని చోట్ల ముంపునీరు తొలగించేందుకు వీలు లేకుండా వరిచేలు పూర్తిగా జలమయమయ్యాయి. రాజోలు నియోజకవర్గ పరిధిలో 220 ఎకరాల్లో రైతులు వరి నారుమడులు వేయగా సుమారు 100 ఎకరాల్లో నారుమడులు దెబ్బతిన్నాయి. రాజోలు మండలంలో 169 ఎకరాల్లో వరి నారుడులు వేయగా 66 ఎకరాల్లో నారుమడులు నీటమునిగాయి. మలికిపురం మండలంలో 36 ఎకరాల్లో నారుమడులకు గాను 18 ఎకరాలు, సఖినేటిపల్లి మండలంలో 12 ఎకరాల్లో నారుమడులు వేయగా తొమ్మిది ఎకరాల్లో వరినారు నీటమునిగింది. రాజోలు మండలంలో చింతలపల్లి, పొన్నమండ, కూనవరం, శివకోడు, బి.సావరం, కడలి గ్రామాల్లోని వరి పొలాలు పూర్తిగా నీటమునిగాయి. నియోజకవర్గంలో వేసిన నారుమడులు సుమారు 4,400 ఎకరాల్లో వరినాట్లు వేసేందుకు సరిపోతుంది. అకాల వర్షం కారణంగా నీటమునిగిన ఆకుముడులు పాడైపోవడంతో 50 శాతం మేర 2,200 ఎకరాల్లో వరినాట్లు వేసేందుకు వరినారు కొరత వస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరినారు కొరత కారణంగా వరినాట్లు వేసేందుకు సమయం మించిపోతుందని, సార్వా పంట ఆలస్యంగా చేతికి వస్తుందంటున్నారు. దీని ప్రభావం దాళ్వాసాగుపై పడుతుందని ఆందోళన చెందుతున్నారు. కొన్ని గ్రామాల్లో సార్వా సాగును నిలిపివేసి దీపావళి నాటికి దాళ్వా సాగుకు చేసేందుకు రైతులు ఆలోచన చేస్తున్నారు.



చింతలపల్లిలో నీట మునిగిన నారుమడి చూపిస్తున్న రైతులు

ముందస్తు వరినాట్లు వేసిన రైతులకు నష్టం

ముందస్తుగా వరినారుమడులు వేసిన రైతులు కొందరు వరినాట్లు పూర్తి చేశారు. రాజోలు మండలంలో సుమారు 114 ఎకరాల్లో వరినాట్లు పూర్తి కాగా 27 ఎకరాల్లో వరినాట్లు వేసిన పొలాలు ముంపునీటితో చెరువులను తలపిస్తున్నాయి. మలికిపురం, సఖినేటిపల్లి మండలాల్లో సుమారు 10 ఎకరాల్లో వరినాట్లు పూర్తి చేయగా సుమారు ఐదు ఎకరాలు ముంపునీటి బారిన పడ్డాయి. ఇదే విధంగా ముంపునీరు రెండు, మూడు రోజులు కొనసాగితే వరినాట్లు వేసిన పొలాలు ఎందుకూ పనికిరాకుండా పోతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

డ్రైయిన్లలో నీరు వెనక్కి రావడంతో ముంపు

వరి చేలల్లోని వర్షం నీరు దిగేందుకు ఉన్న డ్రైయిన్ల వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యం కావడంతో రైతులకు కష్టాలు ఎదురవుతున్నాయి. వరి చేలల్లోని ముంపునీరు దిగేందుకు ఉన్న డ్రైయిన్లలోని నీరు వెనక్కి రావడంతో వరిచేలు మరింతగా ముంపునకు గురవుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. వరి చేలల్లోని ముంపునీరు తొలగించుకునేందుకు వీలు లేకుండా డ్రెయిన్‌లోని నీరు వెనక్కి రావడంతో ఆందోళన చెందుతున్నారు. దీనికి ప్రధాన కారణం డ్రెయిన్‌లోని విపరీతంగా పెరిగిపోయిన గుర్రపుడెక్కతో పాటు, రొయ్యల చెరువుల్లోని వాడకం నీటితో పాటు, ఆ చెరువుల్లో ఉన్న మురుగు, మట్టిని ప్రత్యేకమైన యంత్రాల్లో డ్రెయిన్‌లోకి తోడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. రొయ్యల చెరువుల్లోని మురుగు, మట్టి డ్రెయిన్‌లో చేరి నీటి ప్రవాహానికి ఆటంకం పడి వరి చేలల్లోకి డ్రెయిన్‌లోని నీరు వెనక్కి వచ్చి పొలాలను ముంచెత్తుతున్నాయిని వాపోతున్నారు.

నారుమడులు పూర్తిగా దెబ్బతిన్నాయి



వర్షం నీటిలో మునిగిపోయి నారుమడులు పూర్తిగా దెబ్బతిన్నాయి. వరినారు వేసేందుకు ఎకరానికి సుమారు రూ.4 వేలు పెట్టుబడి పెట్టాం. విత్తనాలు, దమ్ము, ఎరువులు, కూలీలతో నానా ఇబ్బందులు పడి నారుమడులు వేసుకున్నాం. అకాల వర్షంతో వరినాట్లు వేయకుండానే నారుమడి నీటమునిగింది. నారుమడిలోని ముంపునీటిని తొలగించుకునేందుకు ఎంత ప్రయత్నించినా ఫలితం లేదు.

– పితాని నాగేశ్వరరావు, రైతు, చింతలపల్లి

డ్రైయిన్ వ్యవస్థను బాగు చేయాలి



వరిచేలల్లోని ముంపునీరు దిగేందుకు ఉన్న డ్రైయిన్ వ్యవస్థను పూర్తిగా బాగు చేయాలి. వర్షాలకు ముంపునకు గురైన వరి చేలల్లోని నీరు డ్రెయిన్‌లోకి దిగడం లేదు. అంతే కాకుండా డ్రెయిన్‌లోని నీరు తిరిగి వెనక్కి చేలల్లోకి వచ్చేస్తుంది. దీంతో వర్షాల సమయంలోనే కాకుండా సాధారణ రోజుల్లో కూడా వరి చేలు ముంపునకు గురవుతున్నాయి.

– సాగి వీరభద్రరాజు, రైతు, చింతలపల్లి

సార్వా ఆలస్యమైతే దాళ్వాపై ప్రభావం



నారుమడులు పూర్తిగా పాడైపోవడంతో వరినారు కొరత ఏర్పడుతుంది. మళ్లీ నారుమడులు వేయడం చాలా కష్టం. ఇప్పటికే సార్వా నాట్లు వేసే సమయం మించిపోయింది. ఏదో విధంగా వరినారు సమకూర్చుకుని నాట్లు వేసినా ఫలితం లేదు. సార్వా సాగు ఆలస్యమైతే సరైన దిగుబడి రాదు. పైగా ఈ ప్రభావం దాళ్వాపై పడుతుంది

– మామిడిశెట్టి మధుసూదన్, రైతు, చింతలపల్లి

అధికారులు అప్రమత్తమవ్వాలి



ముక్తేశ్వరం-అయినవిల్లిలంక కాజ్‌వేను సందర్శించిన జేసీ నూపుర్ అజయ్

అయినవిల్లి: బంగాళాఖాతంలో అధిక అల్పపీడనం ఏర్పడడంతో కురుస్తున్న వర్షాలకు అధికారులు అప్రమత్తమవ్వాలని ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించి అధిక నష్టాన్ని నివారించాలని జిల్లా జేసీ నూపుర్ అజయ్ ఆదేశించారు. శుక్రవారం ఆమె అయినవిల్లి మండలంలోని ముక్తేశ్వరం-అయినవిల్లిలంక వద్ద ఎదురుబిడెం కాజ్‌వేను అధికారులతో కలసి సందర్శించారు. ఆమె మాట్లాడుతూ వరదల నేపథ్యంలో వరద ప్రభావిత గ్రామాలైన చింతనలంక, వీరవల్లిపాలెం, పొట్టిలంక, కొండుకుదురులంకలోని గున్నంమెరక, తొత్తరమూడిలోని కె.పెదలంక, మడుపల్లిలోని మడుపల్లిలంక గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. లోతట్టు ప్రాంతాల నుంచి ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించారు. ఏ క్షణాన్నైనా వరదలు ముంచెత్తే ప్రమాదం ఉందని, అధిక నష్టం వాటిల్లక ముందు ప్రజలు వ్యవసాయ ఉత్పత్తులు, పశువులను రక్షించుకోవాలన్నారు. అలాగే లోతట్టు ప్రాంతాల్లో ముందస్తు చర్యగా పడవలను అందుబాటులో ఉంచాలన్నారు. ఆయా శాఖ అధికారులు అందుబాటులో ఉంటూ ప్రజలకు అండగా నిలవాలన్నారు. తొలుత ఆమె స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ శాఖలకు చెందిన అధికారులతో సమీక్షించారు. వరద విపత్తుల నుంచి అధిక నష్టాన్ని ఎలా నివారించవచ్చు అనే అంశంపై చర్చించారు. అన్ని శాఖల సమన్వయంతో రెవెన్యూ, పంచాయతీశాఖ అధికారులు పనిచేయాలని ఆదేశాలు జారీ చేశారు.

క్షేత్రస్థాయిలో అవగాహన పెంచుకోవాలి



అంబాజీపేట పరిశోధన కేంద్రంలో విద్యార్థులకు బదనికలను వివరిస్తున్న కేంద్ర అధిపతి చలపతి

అంబాజీపేట: పంటలను ఆశించే తెగుళ్లు, పురుగులు వాటి నియంత్రణకు, చేపట్టే రక్షణ చర్యలు తదితర అంశాలను క్షేత్రస్థాయిలోనే అవగాహన పెంచుకుంటే పరిణితి పొందవచ్చని పరిశోధన కేంద్ర అధిపతి డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు అన్నారు. అంబాజీపేటలో డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రాన్ని రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాల బీఎస్సీ సెకండియర్ విద్యార్థులు శుక్రవారం సందర్శించారు. పరిశోధన కేంద్రంలో జరుగుతున్న పరిశోధనలను వివరించారు. ఉద్యాన విభాగం, కొబ్బరి పంట సాగు వివరాలు, కొబ్బరిలో మేలైన రకాలు, హైబ్రీడ్ రకాలు ఉత్పత్తి విధానం, నాణ్యమైన మొక్కలపై విద్యార్థులకు చలపతి అవగాహన కల్పించారు. బదనికలను ప్రయోగశాలలో అభివృద్ధి చేసే విధానాన్ని, కొబ్బరి, కోకోలో జరుగుతున్న పరిశోధనలు, తెగుళ్ల విభాగంలో జీవనియంత్రణ శిలింద్రాలను ప్రయోగశాలలో ఉత్పత్తిపై వివరించారు. పురుగులు, తెగుళ్ల యాజమాన్యం, జీవనియంత్రణ పద్ధతులు అమలు చేసే విధానాన్ని, పథకాలను శాస్త్రవేత్త డాక్టర్ వి.గోవర్ధనరావు, తెగుళ్ల విభాగం శాస్త్రవేత్త బి.నీరజ, కీటక విభాగం శాస్త్రవేత్త డాక్టర్ వి.అనూష, ఉద్యాన విభాగం శాస్త్రవేత్త ఎ.కిరిటీ విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ కేఎం దక్షిణామూర్తి, డాక్టర్ బి.అనూష పాల్గొన్నారు.

నిలిచిన పంటు ప్రయాణం



ముక్తేశ్వరం-కోటిపల్లిలోని తాత్కాలిక రహదారిపై ఉధృతంగా ప్రవహిస్తున్న వరద

అయినవిల్లి: ఎగువన కురుస్తున్న వర్షాలకు వరదనీటి మట్టం పెరగడంతో అధికారులు ముక్తేశ్వరం-కోటిపల్లిరేవు పంటు ప్రయాణాన్ని శుక్రవారం నుంచి నిలిపివేశారు. వరద ఉధృతికి ముక్తేశ్వరం-కోటిపల్లిరేవులో నీటిమట్టం గణనీయంగా పెరిగింది. దీంతో అధికారులు ముందుస్తు చర్యగా పంటు ప్రయాణం నిలిపివేశారు. వరద ఉధృతి తగ్గే వరకూ పంటుపై ప్రయాణాలు ఉండవని అధికారులు చెబుతున్నారు. వరదనీటి ప్రవాహానికి ముక్తేశ్వరం-కోటిపల్లిరేవులో ముక్తేశ్వరం వైపు వేసిన తాత్కాలిక రహదారి మునిగింది. వరద నీటి ఉధృతికి ఈ రహదారి పూర్తిగా కొట్టుకుపోయింది. ఇక్కడి రైతులు నాటు, ఇంజిన్ పడవల పై రాకపోకలు కొనసాగిస్తున్నారు.

ప్రభుత్వ విద్యకు పెద్దపీట



నేదునూరులో విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

అయినవిల్లి/మామిడికుదురు: ప్రభుత్వ విద్యకు తమ పాలనలో పెద్దపీట వేసినట్టు స్థానిక ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం అయినవిల్లి మండలం నేదునూరు, మామిడికుదురు మండలం లూటుకుర్రు జెడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేద విద్యార్థులకు ఆర్థికంగా చేయూతనందిస్తుందన్నారు. కార్యక్రమాల్లో జెడ్పీటీసీ జి.శ్రీనివాసరావు, సర్పంచ్ గుమ్మడి ప్రసాద్, ఎంపీటీసీలు కట్లపల్లి సుబ్బరాజు, ఇందుగుల వెంకట్రామయ్య, డీఈఓ ఎం.కమలకుమారి, జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ మధుసూదనరావు, జెడ్పీటీసీ కశిరెడ్డి అంజిబాబు, ఎంపీపీ కుసుమ వనజకుమారి తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో ప్రజా సమస్యలు పరిష్కరించాలి

పి.గన్నవరం: ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం పి.గన్నవరంలో జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమైన శాఖల అధికారులు ప్రజలకు ఫోన్ కాల్‌లో అందుబాటులో ఉండాలని సూచించారు. విధి నిర్వహణలో అధికారులు అలసత్వం వహిస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. సమావేశంలో సభ్యులు తెలియజేసిన సమస్యలను, మళ్లీ వచ్చే సమావేశం నాటికి పరిష్కారం కావాలని ఆదేశించారు. పోతవరం ముగ్గుబట్టీ సెంటర్‌కు సమీపంలోని వరిచేలల్లో ముంపునీరు దిగడం లేదని ఎంపీటీసీ పులపర్తి రాజారావు తెలిపారు. పలు ప్రాంతాల్లో లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలని, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని సర్పంచ్‌లు బొండాడ నాగమణి, ప్రత్తిపాటి ఉమామహేశ్వరి, ఎంపీటీసీలు ఎ.సత్తిబాబు, ఎస్.దామోదరంలు కోరారు. విద్యుత్ సరఫరా నిలిచిపోతే సంబంధిత అధికారులు గానీ, సిబ్బంది గానీ ఫోన్ కాల్స్‌కు స్పందించడం లేదని పలువురు సభ్యులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. తీరు మార్చుకోవాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. తహసీల్దార్ షేక్ హుస్సేన్, ఎంపీడీఓ సీహెచ్ త్రిశూలపాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పందుల పెంపకందారులే బాధ్యత వహించాలి

అంబాజీపేట: పందుల వల్ల వ్యవసాయ పంటలకు నష్టం వాటిల్లితే పందుల పెంపకందారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని డీఎల్పీఓ పి.బొజ్జిరాజు హెచ్చరించారు. మాచవరం పంచాయతీ కార్యాలయంలో రైతులు, పందుల పెంపకం దారులతో పంచాయతీ కార్యదర్శి కుమార్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. డీఎల్పీఓ బొజ్జిరాజు మాట్లాడుతూ పందుల పెంపకందారులు పందులను వారి కాంపౌండ్ వాల్‌లో ఉంచుకుని బయట నుంచి వాటికి ఆహారం తెచ్చి పెంచుకోవాలని, పొలాల్లోనూ, బహిరంగ ప్రదేశాల్లో వదిలిపెడితే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. సర్పంచి నాగాబత్తుల శాంతకుమారి మాట్లాడుతూ పందుల పెంపకందారులకు రెండు రోజులు గడువిస్తున్నామని, వాటిని కట్టడి చేస్తే సరే సరి లేని పక్షంలో వాటిని పట్టించి దూర ప్రాంతాల్లో విడిచి పెడతామన్నారు. కార్యక్రమంలో రైతులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయ చర్యలు చేపట్టాలి

రాజోలు: వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయ చర్యలు చేపట్టాలని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. శుక్రవారం తాటిపాకలో ఆయన మాట్లాడుతూ కోనసీమ జిల్లాలో ఉన్న లంక గ్రామాల పరిస్థితులపై అధికారులు దృష్టి సారించాలన్నారు. రాజోలు నియోజకవర్గంలో అప్పనరామునిలంక, సఖినేటిపల్లి లంక, తాటిపాక మఠం సమీపంలోని లంక వాసులతో పాటు అగ్నికుల క్షత్రియులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. అవసరమై న ప్రాంతాల్లో మెడికల్ క్యాంప్‌లు, తాగునీటి సదుపాయం, ఆహారం కొరత లేకుండా చూడాలని కోరారు. ఆయా గ్రామాల్లోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు సహాయక చర్యల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

స్తంభించిన జనజీవనం

- ఎడతెరిపి లేని వర్షం
- ముంపునకు గురైన వరిచేలు
- ఉద్యాన పంటలకు నష్టం

అలమూరు: అల్పపీడన ప్రభావంతో మూడు రోజులుగా ఏకధాటిగా కురుస్తున్న వర్షాల వల్ల మండలంలో జనజీవనం స్తంభించింది. వివిధ గ్రామాల్లో వరి చేలు నీట మునగగా ఇటుక బట్టీలకు తీవ్ర నష్టం వాటిల్లింది. గుమ్మిలేరు, మోదుకూరు, పినపళ్ల తదితర గ్రామాల్లోని పల్లపు భూముల్లో వెదజల్లు విధానంలో సాగు చేసిన చేలు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పల్లపు భూముల్లోని వరినాట్లు నీట మునిగాయి. చింతలూరులోని పంటచేలు చెరువులను తలపిస్తుండటంతో నీరు బయటకు వచ్చే మార్గం కనిపించడం లేదు. అలాగే ఈ భారీ వర్షాల ధాటికి మరో రెండు వారాల వరకూ ఇటుక బట్టీలు తెరిచే పరిస్థితి కనిపించడం లేదు.

దిండి వంతెనపై ముంపు నీరు

మలికిపురం: ఉభయజిల్లాల మధ్య ఉన్న దిండి- చించినాడ వంతెనపై భారీ వర్షాల కారణంగా ముంపు నీరు నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు మచిలీపట్నంలో ఉన్న బ్రిడ్జి మెయింటెనెన్స్ అధికారుల దృష్టికి తెచ్చారు. సమస్య వివరించడంతో శుక్రవారం ఉదయమే సిబ్బంది చేరుకుని బ్రిడ్జి పై నీరు తొలగించేందుకు చర్యలు తీసుకున్నారు. ఇలా తాత్కాలిక చర్యలు కాకుండా నీరు నిలవకుండా శాశ్వత చర్యలు తీసుకోవాలని సామాజిక సేవకులు బోనం రాజు అధికారులకు సూచించారు.

కుండపోత

రావులపాలెం: గత రెండు రోజులుగా కురుస్తున్న కుండ పోతవర్షాలతో శుక్రవారం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై వ్యాపారాలు సాగించే చిరు వ్యాపారులు వర్షాల కారణంగా దుకాణాలు మూసి వేశారు. అలాగే పలు పల్లపు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరడంతో రోడ్లు జలమయంగా మారాయి.

అంబాజీపేటలో..

అంబాజీపేట: మూడు రోజులు నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు అంబాజీపేట మండలంలో జనజీవనం స్తంభించింది. గురువారం రాత్రి నుంచి శుక్రవారం వరకు ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురవడంతో రహదారులు, పలు కాలనీలు, వరి చేలు, నారుమడులు నీట మునిగాయి. పలు గ్రామాల్లోని వరి చేలు నీట మునిగాయి. భారీ వర్షానికి చిరు వ్యాపారులు, విద్యార్థులు, అధికారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గంగలకుర్రు అగ్రహారం శివారు మట్టపర్తి వారిపాలెంకు చెందిన దొమ్మేటి సూర్యకాంతం తాటాకిల్లు కూలిపోయింది.



గెద్దాడలో ముంపునకు గురైన ఆర్‌అండ్‌బీ రోడ్డు

పంట పొలాలను ముంచెత్తిన వర్షం

మామిడికుదురు: రెండు రోజుల నుంచి కుండ పోతగా కురుస్తున్న వర్షంతో జనజీవనం పూర్తిగా స్తంభించింది. మామిడికుదురు మండలంలో గడచిన 24 గంటల్లో రికార్డు స్థాయిలో 69.60 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పంట పొలాలను వర్షం నీరు ముంచెత్తింది. గెద్దాడ ఆర్‌అండ్‌బీ రోడ్డు పరిస్థితి భారీ వర్షాలకు దారుణంగా మారింది. ఈ రోడ్డును వర్షం నీరు ముంచెత్తడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

చెరువులు తలపిస్తున్న నారుమడులు

ఆత్రేయపురం: అల్పపీడనం ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో అన్నదాతలు కుదేలయ్యారు. వర్షాలకు మండలంలోని సుమారు 5500 ఎకరాల్లో వరి సాగు అవుతుండగా అందుకు రైతులు నారుమడులు వేసి వరినాట్లు వేసే పనిలో నిమగ్నమయ్యారు. అలాగే కుండపోత వర్షాలకు కూరగాయల తోటలు ధ్వంసమయ్యాయి. ఉద్యాన వన పంటలైన అరటి, పసుపు, కోకో, కంద తదితర పంటలు సాగు చేస్తున్న రైతులు తీవ్రంగా నష్టపోయారు.



పినపళ్లలో వర్షాల ప్రభావంతో తీవ్రంగా దెబ్బతిన్న ఇటుక బట్టీలు

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: అల్పపీడనం ప్రభావంతో మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో పలు గ్రామాల్లో వరిచేలు నీటమునిగాయి.

ముంపులో కాలనీలు, పంటచేలు

అయినవిల్లి: అధిక వర్షాల వల్ల మండలంలోని పలు కాలనీలు, పంటచేలు, ఇటుక బట్టీలు ముంపునకు గురయ్యాయి. పలు గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లో ఉన్న కాలనీల్లో వర్షం వల్ల ఎక్కడి నీరు అక్కడే నిలిచిపోయి రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. ఈ కాలనీల్లో డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షం నీరు వారం నుంచి పదిహేను రోజులు పైనే నిలిచి పోతుందని రోగాలు ప్రబలుతాయని ప్రజలు వాపోతున్నారు.

గోదావరికి పోటెత్తిన వరద

అయినవిల్లి: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు వరదనీటి మట్టం పెరగడంతో ముక్తేశ్వరంలోని వృద్ధగౌతమి పాయలోకి వరదనీరు చేరింది. అలాగే ముక్తేశ్వరం-కోటిపల్లిరేవులోని తాత్కాలిక రహదారి పైకి వరదనీరు చేరింది. లంకల్లోని కూరగాయల తోటలు ముంపునకు గురికాకుండా రైతులు ప్రస్తుతానికి జాగ్రత్తలు తీసుకున్నారు.

అలమూరు: మండలంలోని లంక ప్రాంతాల వెంబడి గౌతమీ గోదావరికి వరద పోటెత్తుతుంది. బడుగువానిలంక, మూలస్థాన అగ్రహారం, చొప్పెల్ల, జొన్నాడ, ఆలమూరు గ్రామాల్లోని రైతులు అప్రమత్తమయ్యారు. తమ వ్యవసాయ సామగ్రిని బయటకు తరలిస్తున్నారు. పశువులను రక్షణ ప్రదేశాలకు తీసుకువెళుతున్నారు. తహసీల్దార్ డీవీఎస్ అనిల్‌కుమార్ ఎంపీడీఓ ఎ.మేరీ రోజ్, ఎస్సై ఎల్.శ్రీను నాయక్ తదితరులు మండలంలోని బడుగువానిలంకలో పర్యటించి వరద పరిస్థితిని సమీక్షించారు. లంక ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందవద్దని, అధికారులందరూ అప్రమత్తంగా ఉంటారని వారు భరోసా కల్పించారు. అవసరమైతే పునరావాస శిబిరాలను ఏర్పాటు చేస్తామని మండల స్థాయి అధికారుల బృందం పేర్కొంది.

600 ఎకరాలు వరి పంట నీట మునక

అంబాజీపేట: గత మూడు రోజులుగా భారీ వర్షాలకు 600 ఎకరాల్లో వరి పంట నీట మునిగిందని మండల ఏవో సీహెచ్‌డీ విజయ్‌కుమార్ తెలిపారు. పుల్లేటికుర్రు, గంగలకుర్రు, పసుపల్లి, ఇరుసుమండ, మొసలపల్లి, కె.పెదపూడి, వ్యాఘ్రేశ్వరం, ఇసుకపూడి తదితర గ్రామాల్లో నీట మునిగిన వరి చేలను శుక్రవారం పరిశీలించారు. మండలంలో 2,990 ఎకరాల్లో వరి పంట సాగు చేస్తున్నారని ఇప్పటి వరకు 1,850 ఎకరాల్లో వరి నాట్లు వేశారన్నారు. వరి చేలల్లో ఉన్న వర్షపు నీటిని బయటకు తరలించేలా రైతులు చర్యలు తీసుకోవాలని సూచించారు.